
సాక్షి
పల్నాడు
మంగళవారం । 8 । జూలై । 2025



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1700, మోడల్ ధర రూ.1300 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 529.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎడమ కాలువకు 3,374 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఉంగుటూరు మండలం ఆత్కూరులో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల పదో తేదీన పర్యటించను న్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ సోమవారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రతిపాదనలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులతో పాటు ఉప విద్యాశాఖాధికారుల ద్వారా ఈనెల 13వ తేదీలోపు https://nationalawardstoteachers.education.gov.in సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోటప్పకొండ తొలిఏకాదశి ఆదాయం రూ.24.02లక్షలు



నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి రూ.24.02 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు తెలిపారు. స్వామి వారి హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించి ఆదాయ వివరాలు వెల్లడించారు. టిక్కెట్ల ద్వారా రూ.9,09,090లు, ప్రసాదాల ద్వారా రూ.4,39.380లు, హుండీల ద్వారా రూ.9,68,028లు, అన్నదానానికి రూ.86,051లు ఆదాయం లభించినట్టు వివరించారు.

మెగా పేరెంట్స్ మీట్‌కు పటిష్ట ఏర్పాట్లు



నరసరావుపేట: జిల్లాలో ఈనెల 10న నిర్వహించనున్న 'మెగా పేరెంట్స్ మీట్'కు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1580 ప్రభుత్వ, 458 ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 2,308 పాఠశాలలు, 91 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. హాజరయ్యే వారికి భోజన సదుపాయాలతో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తగా వండించాలన్నారు.

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

గుంటూరు లీగల్: లైంగిక దాడి కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమీ పర్వీన్ సుల్తానా బేగం సోమవారం తీర్పు వెలువరించారు. 2014లో పొన్నూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసులో 32 సంవత్సరాల మద్దసాని సురేంద్ర 13 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో సమర్పించారు. కేసులో నేరం రుజువు కావడంపై ముద్దాయికి జీవిత ఖైదు, రూ. 10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి నష్టపరిహారం కింద ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు చెల్లించేలా తీర్పు చెప్పారు. ముద్దాయిని జిల్లా జైలుకు తరలించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బరత్ అలీఖాన్ వాదనలు వినిపించారు. బాధిత బాలికకు న్యాయం జరిగిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.



పులిచింతల భూమిపూజ అనంతరం ప్రసంగిస్తున్న డాక్టర్ వైఎస్సార్ (ఫైల్)

'వైఎస్సార్'.. పేరు వినగానే పేదల మోములు వికసిస్తాయి.. లక్షల జతల నేత్రాలు చెమరుస్తాయి

ఆయనంటే నమ్మకం.. ఆయనుంటే జన సందోహం.. ఆయనే పేదల పాలిట దైవం

ఆరోగ్య శ్రీతో లక్షలాది ప్రజల గుండె సవ్వడుల్లో నేటికీ ఆయన సజీవం

జలయజ్ఞపు జలధారల్లో.. సస్య శ్యామలమైన పంటపొలాల్లో..
అన్నదాతల చిక్కటి చిరునవ్వుల్లో నేటికీ ఆయన చిరునామా శాశ్వతం

ఇంజినీర్లుగా.. వైద్యులుగా రాణిస్తున్న పేదింటి బిడ్డల హృదయాల్లో ఆయన స్థానం చిరస్మరణీయం

సంక్షేమ రేడుగా.. అభివృద్ధి సూరీడుగా.. పేదింటి దేవుడిగా.. వైఎస్సార్ ప్రాతఃస్మరణీయుడు

ఉమ్మడి జిల్లాపై మహానేత మమకారం అపూర్వం.. జిల్లా అభివృద్ధిపై ఆయనది చెరగని సంతకం



ఉమ్మడి జిల్లా పై రాజముద్ర

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు వైఎస్సార్ పాలన ఓ స్వర్ణ యుగం
- అన్నదాతలపై మమకారానికి చిహ్నంగా పులిచింతల నిర్మాణం
- పశ్చిమ డెల్టా, సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ
- రాష్ట్రానికే తలమానికం స్పైసెస్ పార్కు నిర్మాణం
- గుంటూరు నగర వాసుల దాహార్తి తీర్చిన రాజన్న
- గుంటూరు నగరంలోనే ఆరోగ్యశ్రీకి అంకురార్పణ
- రాజకీయంగా జిల్లాకు అధిక ప్రాధాన్యం

నేడు మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కష్టాలలో ఉన్న రైతన్నకు గుండె చప్పుడుగా మారారు.. రైతు సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో అన్నీ చేశారు. డెల్టాను స్థిరీకరించేందుకు పులిచింతల ప్రాజెక్టును నిర్మించి.. తనదైన ముద్ర వేశారు.. ఆయనే దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి. గుంటూరు జిల్లాపై ఆయన చెరగని ముద్ర వేశారు. జిల్లాలో 57 సార్లు పర్యటించిన ఘనత ఆయనకే దక్కింది.

'చింత'లు తీర్చిన రాజన్న

జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన పులిచింతల ప్రాజెక్టు 2004, అక్టోబరు 15న రూ. 680 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో విజయవాడ, గుంటూరు నగరాల తాగునీటి దాహార్తి తీర్చడంతోపాటు కృష్ణా డెల్టాలో 13 లక్షల ఆయకట్టు స్థిరీకరించడానికి ఉపయోగపడింది.

- నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ కోసం 2008, ఫిబ్రవరి 2న రూ. 4,444.41 కోట్లతో సాగర్ కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు అనుమతి ఇచ్చారు. దీని ద్వారా నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో 6.74 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో కాలువల ఆధునికీకరణ కోసం రూ. 4,573 కోట్లు కేటాయించారు. ఇందులో గుంటూరు జిల్లాకు సంబంధించి రూ.1760.15 కోట్లను కాల్వల ఆధునీకరణకు కేటాయించారు. ఇందులో రూ.1187 కోట్ల పనులు జరిగాయి. దీని ద్వారా జిల్లాలో 5.22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.
- రూ.100 కోట్లు వైఎస్సార్ వరికపూడి శెలకు కేటాయించి శంకుస్థాపన చేశారు.

జిల్లాకు అధిక ప్రాధాన్యం

ఆర్థికంగా, రాజకీయంగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు మహానేత డాక్టర్ వైఎస్సార్ అధిక ప్రాధాన్యం కల్పించారు. జిల్లాకు నాలుగు మంత్రి పదవులు కేటాయించడంతోపాటు, పథకాలు అమలులో సైతం పెద్ద పీట వేశారు.

- రాష్ట్రవ్యాప్తంగా రూ. 12 వేల కోట్ల రుణమాఫీలో జిల్లాకు చెందిన 6.7 లక్షల మందికిపైగా రైతులకు రూ. 560 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.
- వైఎస్సార్ చివరి సంతకం చేసిన ఫైల్ కూడా జిల్లాలో మిర్చి రైతులకు వాతావరణ ఆధారిత బీమా కింద ప్రయోజనం చేకూర్చేదే. ఈ బీమాతో జిల్లాలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారు.
- ఇందిర ప్రభ పథకాన్ని జిల్లాలోనే ప్రారంభించారు. ఇందిరమ్మ ఫేజ్-2 ఇళ్లను జిల్లాలోనే ప్రారంభించారు.
- రాజీవ్ పల్లెబాట ద్వారా ఎన్నో గ్రామాలకు తాగునీరందించి పల్లె వాసుల మనసులో చెరగని ముద్ర వేశారు.



2004, అక్టోబర్ 15న పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

రాష్ట్రానికే తలమానికం స్పైసెస్ పార్కు

ఉద్యాన పంట మిర్చి సాగు విస్తీర్ణత, ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పెద్దపీట వేశారు. భారతదేశంలోనే రెండవ అతిపెద్ద స్పైసెస్ పార్కును తెలుగు రాష్ట్రానికి ఆయన తీసుకువచ్చారు. సుమారు రూ.100 కోట్లతో ప్రాజెక్టులో అంతర్గత రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

- ఈ సుగంధ పార్కుకు జిల్లాలోని యడ్లపాడు మండలం, మైదవోలు - వంకాయలపాడు రెవెన్యూ పంచాయితీల పరిధిలో 124.79 ఎకరాలను ప్రభుత్వానికి కేటాయించారు. 2008 ఆగస్టు 21న వైఎస్సార్ జోరు వానను సైతం లెక్క చేయకుండా వచ్చి ఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. స్పైసెస్ బోర్డు అధికారులు ప్రాసెస్ యూనిట్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో మిర్చి, పసుపు ఇతర సుగంధ ద్రవ్యాల పరిశోధనలు చేయడంతో పాటు అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, రైతులకు స్థానికంగానే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి వంటి ఎన్నో ప్రయోజనాలు ఈ స్పైసెస్ పార్కు ద్వారా లభించనున్నాయి.
- పార్కులో 24.77 ఎకరాల్లో రెండు గిడ్డంగులను నిర్మించారు. 6500 మెట్రిక్ టన్నుల నిల్వల సామర్థ్యం కలిగిన ఈ గిడ్డంగులు సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి ఐదు అంతస్థులు. ఈ భవనాలను ఒకటి మిర్చి, రెండోది పసుపు నిల్వలకు కేటాయించారు. ఆయన మరణించి 16 ఏళ్లు దాటిపోయినా జిల్లా ప్రజల గుండెల్లో ఆయన బతికే ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు.

నగరవాసుల తాగునీటి ఇక్కట్లకు చెక్

గుంటూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.6.50 కోట్లతో తక్కెళ్లపాడు రా వాటర్ ప్లాంట్ నుంచి తక్కెళ్లపాడు నీటి శుద్ధి వాటర్ ప్లాంట్ల వరకు రెండోపైపు లైను నిర్మించారు. నగర ప్రజల నీటి కష్టాలు తీర్చిన మహానేతను నగర ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. రూ. 460 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన తాగునీటి పథకానికి ఆయనే అంకురార్పణ చేశారు.



గత ఏడాది వరకు నిండు కుండను తలపించేలా పులిచింతల ప్రాజెక్టు రిజర్వాయర్

ఆరోగ్య శ్రీకి ఇక్కడే నాంది

ఎందరో పేదల ప్రాణాలను నిలిపి, మరెందరికో పునర్జన్మ ప్రసాదించిన ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభానికి గుంటూరు జిల్లానే మహానేత వైఎస్సార్ వేదికగా చేశారు. రైతులకు విద్యుత్ బకాయిలు మాఫీ చేయడం ద్వారా జిల్లాలో 80 వేల మందికి రూ.36 కోట్ల లబ్ధి కలిగింది. ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలోని 80 వేల మంది రైతులకు ఏడాదికి రూ. 281.60 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రిగా మహానేత వైఎస్సార్‌ను జిల్లా ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్ఎస్‌లో 198 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 198 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, డీఎఫ్‌ఓ కృష్ణప్రియ, ఆర్డీఓ కె.మధులత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్, జేసీ, అధికారులు

కందులు, ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులు పండించిన కందులు, రబీ ధాన్యం, ఇతర పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి. వినుకొండ ప్రాంతంలో కందులు రైతుల ఇళ్లవద్దనే మూలుగుతున్నాయి. ప్రభుత్వ గిట్టుబాటు ధరలేవి రైతులకు లభించటంలేదు. పండిన పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

-ఎ.గోపాలరావు, రైతులు, ఏపీ రైతుసంఘం

గురుకుల కళాశాలలో సీటు ఇప్పించండి



నాకు నలుగురు కుమార్తెలు. అందులో ఒకరు దివ్యాంగురాలు. నాల్గో కుమార్తె పూజిత సత్తెనపల్లి రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకుంది. ఉత్తీర్ణురాలైంది. ఇంటర్మీడియేట్ చదివేందుకు గురుకుల కళాశాలలో సీటు ఇప్పించగలరు.

-పచ్చల ప్రభుదాసు, లక్కరాజుగార్లపాడు, సత్తెనపల్లి మండలం

వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



సాగర్‌లోని ఏపీ ఆర్‌జేసీలో 2011 నుంచి ఫుల్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తూ గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియేట్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించాం. ఆ సమయంలో సెల్ఫ్ సెంటర్‌లోని విద్యార్థులు కాపీలు కొట్టేందుకు తాము అవకాశం కల్పించలేదు. దీంతో కళాశాల ఉత్తీర్ణతశాతం తగ్గింది. దీనికి తమను బాధ్యులు చేస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే ఏడుగురు అధ్యాపకులను తొలగించారు. ఇంటర్వ్యూలు నిర్వహించి తమ కంటే తక్కువ క్వాలిఫికేషన్ ఉన్న వారిని లంచాలు తీసుకొని నియమించారు.

-అధ్యాపకులు, ఏపీఆర్‌జేసీ నాగార్జునసాగర్

మహిళ హత్య

బొల్లాపల్లి: మహిళ హత్యకు గురైన సంఘటన మండలంలోని మేళ్లవాగు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జి.కుమారి (35) పొలాల్లో హత్యకు గురైంది. భార్యాభర్తలిద్దరూ ఉదయం పొలంలో పనికి వెళ్లారు. కుమారి సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగా కుమారి మృతి చెంది పడి ఉండాన్ని గమనించారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నాడు. మృతురాలికి ఇరువురు సంతానం ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

లోకపావని.. శాకంబరి

- నేడు శాకంబరిగా కనకదుర్గమ్మ దర్శనం
- ప్రధాన ఆలయాలు, ఉపాలయాలకు కూరగాయలతో అలంకరణ
- మూడు రోజుల పాటు కొనసాగనున్న శాకంబరి ఉత్సవాలు
- ఉత్సవాల్లో ప్రత్యేకంగా కదంబ ప్రసాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోకపావని.. జగజ్జనని కనకదుర్గమ్మ శాకంబరిమాతగా భక్తులను కరుణించనున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయం, ఇతర ఉపాలయాలను, దేవతా మూర్తులను ఆకుకూరలు, కాయగూరలతో విశేషంగా అలంకరిస్తున్నారు. అమ్మవారిని అలంకరించేందుకు అవసరమైన పండ్లు, కాయగూరలు, ఆకుకూరలను దండలుగా సేవా సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే శాకంబరీ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఉత్సవాల నిర్వహణ కోసం కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి సుమారు 20 టన్నులకు పైగా కూరగాయలు, ఆకుకూరలను దాతలు సమర్పించారు. నగరంలోని హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు తమ వంతుగా ఉత్సవాల్లో భాగస్వాములవుతున్నారు. శాకంబరీగా దుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేస్తారు.

గణపతి పూజతో ఉత్సవాలకు శ్రీకారం

మంగళవారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, ఋత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధనతో శాకంబరి ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. సాయంత్రం నాలుగు గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన వంటి వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. పదో తేదీ ఉదయం పది గంటలు పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగుస్తాయి.



కూరగాయలతో ముస్తాబవుతున్న దుర్గగుడి

శాకంబరీ ఉత్సవాలు జరిగే మూడు రోజులూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాలయ దర్శనం రద్దు చేసినట్లు ఆలయ ఈఓ శీనానాయక్ తెలిపారు. అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించే భక్త బృందాల సంఖ్య రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతుండటం, శాకంబరీ ఉత్సవాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

దళితులపై పెరిగిన దాడులు

వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, పేదల పైన దాడులు పెరిగాయని వైఎస్సార్‌ సీపీ బీసీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్‌ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్‌ నాగమల్లేశ్వరరావుపై టీడీపీ గూండాలు పట్టపగలే కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణం, అమానుషమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి ఈ సంఘటనే నిదర్శనమన్నారు. టీడీపీ మూకలు నాగమల్లేశ్వరరావును కొట్టి తీవ్రంగా గాయపరిచారని, టీడీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత దళితులపైనా, పేద వర్గాలపైనా దాడులు అధికమయ్యాయన్నారు. మొన్న తెనాలిలో దళిత యువకులపై పోలీసులు నడిబజారులో కొట్టిన సంఘటన మరొక ఉదాహరణ అని, రాష్ట్రంలో దళితులంటే తెలుగుదేశం పార్టీకి చిన్న చూపు అని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు భవిష్యత్తులో దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, ఇకనైనా దళితులు, పేదల పై దాడులను మానుకోవాలని లేకుంటే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'నూటా' ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారికి లేఖ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘం(నూటా) ఎన్నికల్లో పారదర్శకత లోపించడం వలన ఈ నెల 9న జరిగే నూటా ఎన్నికలను బహిష్కరిస్తూ ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు సోమవారం లేఖ అందజేసినట్లు ఆచార్య కె.సుమంత్‌ కుమార్‌(అధ్యక్ష పదవికి పోటీ అభ్యర్థి), ఆచార్య ఎం.జగదీష్‌ నాయక్‌(ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ అభ్యర్థి) తెలిపారు. తమకు పోటీగా నిలబడిన అభ్యర్థులు విశ్వవిద్యాలయం పరిపాలన పరమైన పదవుల్లో కొనసాగటం వలన ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుందని, కనుక ఎన్నికల నిర్వహణ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 15 రోజులు పాటు ఎన్నికలను వాయిదా వేయాలని ఈనెల 4, 5 తేదీల్లో ఎన్నికల అధికారి ఆచార్య మురళీమోహన్‌కు వినతి పత్రాలు అందించినా నేటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంతో పాటు తమ లేఖలకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో నరకాసుర పాలన

- ఎన్ని కేసులు పెట్టినా వైఎస్సార్‌ సీపీ జెండా వదిలేది లేదు
- సత్తెనపల్లిలో మాజీ మంత్రి పేర్ని నాని



సత్తెనపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

సత్తెనపల్లి: రాష్ట్రంలో నరకాసుర పాలన సాగుతోందని, ఏ రకంగా జరుగుతుందనటానికి తనపై కేసు పెట్టడమే ఒక ఉదాహరణ అని, వైఎస్సార్‌సీపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. వైఎస్సార్‌ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా నమోదైన అక్రమ కేసులో విచారణకు హాజరయ్యేందుకు ఆయన సోమవారం సత్తెనపల్లి వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సత్తెనపల్లి పోలీసులపై పాలకుల ఒత్తిడి ఉందని, వైఎస్సార్‌ సీపీ వారిపై తప్పుడు కేసులు పెడితేనే మీరు ఉద్యోగంలో ఉంటారంటూ బెదిరిస్తే, ఎస్పీ, డీఎస్పీ, సీఐలు ఏం చేస్తారంటూ అన్నారు. 11 సెక్షన్లతో తనపై సత్తెనపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. వాస్తవానికి ఆ రోజు తాను తాడేపల్లి నుంచి వైఎస్‌ జగన్‌ కారులో వచ్చానన్నారు. సత్తెనపల్లి వచ్చే వరకు కూడా ఇక్కడ ఎవరు తెలియదన్నారు. అలాంటిది నేను జనాన్ని పోగు చేశానంట, నేరం చేశానంట, పోలీసుల ఆంక్షలు అతిక్రమించానంటూ నా మీద నేరం మోపి నన్ను నిందితుడిగా చేర్చారన్నారు. సత్తెనపల్లి కాదు జగన్‌తో రాష్ట్రంలో ఏ మూలకెళ్లినా.. కేసు పెట్టినంత మాత్రాన జగన్‌ జెండా వంచుతానా, జగన్‌ పేరు మరిచిపోతానా, జగన్‌తో తిరగడం మానేస్తానా, మీరు ఎన్ని కేసులు పెట్టినా జగన్‌ జెండా వదలనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్ని నాని అన్నారు. ఆయనతోపాటు వైఎస్సార్‌ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్‌ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, పల్నాడు జిల్లా లీగల్‌ సెల్‌ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, పార్టీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, గుజ్జర్లపూడి సతీష్‌, వల్లెం నరసింహారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ అధ్యక్షుడుగా విష్ణువర్ధన్‌ ఎన్నిక



జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న విష్ణువర్ధన్‌

మాచర్ల రూరల్‌: ఆంధ్రప్రదేశ్‌ ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడుగా కోమటి విష్ణువర్ధన్‌ ముదిరాజ్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముదిరాజ్‌ మహాసభ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిపినట్లు ప్రస్తుత అధ్యక్షులు ముదిరాజ్‌ వెల్ఫేర్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ కొర్నీ నారాయణ ముదిరాజ్‌ తెలిపారు. ముదిరాజ్‌ మహాసభ అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం వారి సామాజిక భద్రత కోసం జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా అన్నీ పార్టీలకు ప్రాధాన్యం కల్పించాలని, ఎన్నో ఉద్యమాలు చేసి ముదిరాజ్‌ జాతి పక్షాన అండగా నిలిచిన చరిత్ర ముదిరాజ్‌ మహాసభకు ఉందన్నారు. అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ అండదండలతో ఆంధ్రప్రదేశ్‌ ముదిరాజ్‌ జాతి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని జాతి ఉన్నతి కోసం ఎన్నో ఉద్యమాలు, భారీ మహాసభలు నిర్వహించిన ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర శాఖకు తాను అధ్యక్షుడుగా ఎన్నిక కావటం ఆనందకరంగా ఉందని విష్ణువర్ధన్‌ ముదిరాజ్‌ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా బొమ్మన సుబ్బరాయుడు ముదిరాజ్‌, గుడాల సత్యనారాయణ ముదిరాజ్‌, కోశాధికారిగా బాలబోయిన పాపారావు ముదిరాజ్‌ ఎన్నికైనట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ను సత్కరించారు. కోమటి విష్ణువర్ధన్‌ ముదిరాజ్‌, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ముదిరాజ్‌ విభాగం అధ్యక్షుడుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. విష్ణువర్ధన్‌ ఎన్నికపై రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రెడ్‌బుక్‌ను కూటమి నేతలు తగులబెట్టాలి

- సోషల్‌ యాక్టివిస్టు ఈదర గోపీచంద్‌
- హైకోర్టు ఆదేశాలు హర్షణీయం

నరసరావుపేట: రాష్ట్రంలో 13 నెలలుగా కొనసాగుతున్న రెడ్‌బుక్‌ రాజ్యాంగపు రౌడీయిజానికి 1161 మంది గురై వారి భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడిన నేపథ్యంలో, ఎట్టకేలకు హైకోర్టు స్పందించి రిమాండ్‌ విధించే ముందు మేజిస్ట్రేట్లు నిబంధనలను గట్టిగా పాటించాలని ఆదేశించడం హర్షణీయమని సోషల్‌ యాక్టివిస్టు ఈదరగోపీచంద్‌ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అరాచక పాలన చేసిన కూటమి నేతలు, పోలీసులకు ఈ ఆదేశాలు చెంపపెట్టు లాంటివని అన్నారు. ఈ ముఖ్యమైన అంశంపై సోషల్‌ మీడియా యాక్టివిస్ట్‌ హరీశ్వర రెడ్డి చొరవ తీసుకుని హైకోర్టులో పిటిషన్‌ వేయడం అభినందనీయమని అన్నారు. ఇంతటితో ఆగకుండా ఇప్పటికే పెట్టిన 1161 కేసులను సమీక్షించి నిర్దోషులను కేసుల నుంచి తప్పించేందుకు పోలీసు వేధింపులు, హింసకు గురైన వారికి ఊరట కల్పించి, నష్టపరిహారం ఇప్పించేందుకు, చట్ట విరుద్ధంగా వ్యవహరించిన మేజిస్ట్రేట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సిట్టింగ్‌ జడ్జితో ఒక ప్రత్యేక విచారణ కమిటీని హైకోర్టు నియమించేలా పోరాటం కొనసాగించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌ ఇకనైనా బుద్ధి తెచ్చు కుని, పశ్చాత్తాపం చెంది రెడ్‌బుక్‌ని నడిరోడ్డులో తగల పెట్టాలని డిమాండ్‌ చేశారు.

పట్టణంలో వైద్యురాలి ఇంట భారీ చోరీ

సుమారు రూ.13 లక్షలు అపహరణ



దుండగులు వస్తువుల్ని తీయడంతో ఖాళీ అయిన బీరువా

చిలకలూరిపేటటౌన్‌: పట్టణంలోని వైద్యురాలి ఇంటిలో గుర్తు తెలియని దుండగులు భారీ చోరీ చేసిన ఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక పురుషోత్తమపట్నంలోని అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఇమ్మడి రాణి సంయుక్త సుమారు రెండేళ్లుగా శారద హైస్కూల్‌ రోడ్డులో నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం విధులు ముగించుకుని కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఉంటున్న అన్నయ్య వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి ప్రధాన ద్వారం తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా, దాని పక్కనే మరోవైపు ఉన్న తలుపు తెరిచి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూసింది. గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గ్రహించింది. బీరువా తెరిచి ఇంట్లో అంతా చిందర వందరంగా వస్తువులు, దుస్తులు పడి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని సందర్శించి పోలీసులు వివరాలు సేకరించారు. క్లూస్‌ టీంను పిలిపించి ఆధారాల సేకరించారు. ఇంట్లోని 70 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు, కేజీన్నర వెండి వస్తువులు, పట్టు చీరెలు అపహరణకు గురయ్యాయని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్‌ సీఐ పి రమేష్‌ తెలిపారు.

ఆస్ట్రేలియాలో ఉద్యోగాల పేరిట రూ.36 లక్షల మోసం

- జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్‌: ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని విజయవాడకు చెందిన మ్యాట్రిక్స్‌ కన్సల్టెన్సీ సంస్థ తమను మోసం చేసినట్లు గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన కాకా హనుమంతరావు, ప్రసాదం తేజ రామకృష్ణలు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. జాబ్‌ వీసా కోసం తమ వద్ద రూ.36.50 లక్షలు వసూలు చేశారని, ఇప్పుడు సంస్థ కార్యాలయం మూసివేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్థిక, కుటుంబ, ఆస్తి వివాదాలకు సంబంధించి 96 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ అందిన అర్జీలలో కొన్ని ఇలా...

- ఫారెక్స్‌ వ్యాపారంలో పెట్టుబడి పెడితే ప్రతి నెలా పెట్టుబడిలో 10 శాతం లాభంగా ఇస్తామని చెప్పడంతో నమ్మి మోసపోయానని సత్తెనపల్లి మండలం భీమవరానికి చెందిన బలుసుపాటి కోటయ్య ఎస్పీకి తెలిపాడు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రొంగల ప్రవీణ్‌కుమార్‌, గజ్జల మధుసూదన్‌రెడ్డిలు వ్యాపారం పేరుతో రూ.45,67,500 తీసుకొని మోసం చేశారని వివరించారు.
- నా భర్త ఆరేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడని, ఇద్దరు సంతానంతో సత్తెనపల్లి మండలం బృంగబండకు చెందిన పొలేపల్లి రాజీ తెలిపింది. ఆ తరువాత ఆన్‌లైన్‌లో పరిచయమైన హైదరాబాద్‌కు చెందిన నరసింహా పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్టు ఫిర్యాదు చేసింది. తాను రూ.30 లక్షలు మోసం చేసినట్టు సైబర్‌ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి వేధిస్తున్నాడని వివరించింది.
- మామ, మరిది శారీరకంగా వేధిస్తున్నారని దాచేపల్లికి చెందిన చిన్నం రమ్య తెలిపింది. నా భర్త కాపురానికి పనికిరాడని వైద్యులు తెలిపారని, నాకు భర్త నుంచి విడాకులు ఇప్పించాలని కోరింది. ప్రజాసమస్యల సమస్యల పరిష్కార వేదికలో గతంలో ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపారు.
- నరసరావుపేటలోని ప్రైవేటు ఫైనాన్స్‌ సంస్థలో తీసుకొన్న లోన్‌ మొత్తం చెల్లించినప్పటికీ అదనంగా మరికొంత చెల్లించాలని సంస్థ సిబ్బంది బెదిరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లికి చెందిన ఎండీ హనీఫ్‌ రహమాన్‌ కోరారు.

మీటర్ల ఏర్పాటుపై కూటమి నాయకులను నిలదీయండి

- పిలుపు ఇచ్చిన ప్రజాసంఘాల నాయకులు
- మీటర్ల ఏర్పాటుపై ఆర్టీసీ బస్టాండ్‌ సెంటర్‌లో నిరసన



ఆర్టీసీ బస్టాండ్‌ సెంటర్‌లో విద్యుత్‌ స్మార్టు మీటర్లపై నిరసన తెలియచేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్ల భారాన్ని నిలిపివేయాలని, ఈ విషయంపై ప్రజలంతా ప్రజాప్రతినిధులను నిలదీయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్‌ మీటర్లు రద్దు చేయాలని నిరసన తెలిపారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారానికి రాకముందు గత ప్రభుత్వం అదాని విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్లు బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్లను పగలగొట్టండని పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే అదానితో అనేక ఒప్పందాలు కుదుర్చుకొని ప్రజల నెత్తిన విద్యుత్‌ స్మార్ట్‌ మీటర్ల భారాన్ని మోపుతూ బలవంతంగా ప్రజలకు అంటగడుతున్నారని, దీనివలన ఇప్పటికే ప్రజలకు అర్థం కాకుండా విద్యుత్‌ చార్జీలు పెంచి నడ్డి విరిచారని అన్నారు. ఇప్పుడు స్మార్ట్‌మీటర్లు బిగింపు వలన ప్రజలంతా మరింతగా ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఈ మేరకు పోస్టర్లు ప్రదర్శించారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూరాలజిస్టుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్‌ సుందరాచారి



ప్రిన్సిపాల్‌ డాక్టర్‌సుందరాచారిని అభినందిస్తున్న న్యూరాలజిస్టులు

గుంటూరు మెడికల్‌: ఆంధ్రప్రదేశ్‌ న్యూరో సైంటిస్ట్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన సీనియర్‌ న్యూరాలజిస్టు, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నాగార్జునకొండ వెంకట సుందరాచారీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులో అసోసియేషన్‌ 32వ వార్షిక సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్‌ సుందరాచారీని అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఏడాదిపాటు డాక్టర్‌ సుందరాచారీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కాగా, ఈ సమావేశంలో గుంటూరుకు చెందిన వైద్య విద్యార్థులు డాక్టర్‌ పి.సాయిలక్ష్మి ఫ్రీ పేపర్‌ ప్రజంటేషన్‌ పోటీల్లో రాష్ట్రంలో మొదటి బహుమతి గెలుపొందారు. డాక్టర్‌ పి.వల్లికృష్ణప్రియ పోస్టర్‌ ప్రజంటేషన్‌ పేపర్‌లో మొదటి బహుమతి గెలుపొందారు. సోమవారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు న్యూరాలజిస్టులు నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్‌సుందరాచారీని అభినందించారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సుందరాచారీ గెలుపొందిన వైద్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఉప్పుటూరి అరుణకుమారి, డాక్టర్‌ గొట్టిపాటి బిందు నర్మద, తదితరులు పాల్గొన్నారు.

మంచి యూనిట్లు ఎంపిక చేసుకొని ఆదాయం పెంచుకోండి


లబ్ధిదారులకు సూచించిన అధికారులు



మాట్లాడుతున్న వెంకటరావు, ఇతర అధికారులు

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ మంచి యూనిట్లను ఎంపిక చేసుకొని వాటి ద్వారా కుటుంబానికి ఆదాయం పెంచుకునేలా కృషిచేయాలని అధికారులు సూచించారు. సోమవారం కలెక్టర్‌ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పీఎంఇజీపి, పీఎంఎఫ్‌ఎంఎఫ్‌ రుణాలపై బ్యాంకర్లచే లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని డీఆర్‌డీఎం పీడీ ఝాన్సీరాణి మాట్లాడారు. లబ్ధిదారులకు కావలసిన శిక్షణ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, మార్కెటింగ్‌ చేసేందుకు ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫామ్‌లైన అమెజాన్‌, ఫ్లిఫ్‌కార్ట్‌ వంటి వాటి ద్వారా వీలు కల్పించడం జరుగుతుందని అన్నారు. హార్టీకల్చర్‌ జిల్లా అధికారి ఐ.వెంకటరావు మాట్లాడుతూ డీపీఆర్‌ (డీటెయిల్డ్‌ ప్రాజెక్ట్‌ రిపోర్ట్‌) తయారు చేసుకొని తర్వాత కొటేషన్‌, ఆధార్‌, పాన్‌ కార్డు సిద్ధం చేసి సంబంధిత అధికారికి అందజేసిన తర్వాత లాగిన్‌లో అప్‌డేట్‌చేసి వాటిని అప్రూవల్‌ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో కూడిన యూనిట్లను ఎంచుకొని వాటిపై లబ్ధిదారులు లబ్ధిపొందేలా చేయడమే కలెక్టర్‌ అరుణ్‌బాబు ఆలోచన అన్నారు. లీడ్‌ డిస్ట్రిక్ట్‌ మేనేజర్‌ రాంప్రసాద్‌, డీపీఎం డేవిడ్‌, శ్రీనివాస్‌, యూనియన్‌ బ్యాంకు అధికారులు, సీజీజీబి అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ తిరగబడి వ్యక్తి మృతి



మృతుడు మల్లికార్జునరావు

సంతమాగులూరు(అద్దంకి): ట్రాక్టర్‌ అదుపు తప్పి తిరగబడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. జే పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన నల్లపాటి మల్లికార్జునరావు(41) తన ట్రాక్టరును నడుపుకుంటూ సంతమాగులూరు నుంచి వినుకొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెల్లలచెరువు గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు సమీపంలోకి రాగానే గోతుల రోడ్డు కావడంతో బ్రేక్‌ వేయగా అదుపు తప్పి తిరగబడింది. ఈ ఘటనలో మల్లికార్జునరావు పైనుంచి కిందపడగానే ట్రాక్టరు టైరు తలపైకి ఎక్కింది. రక్తగాయం ఆవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. భర్త మృతితో భార్య, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడి మామ తేలప్రోలు ఆంజనేయులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు.